
సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



నిత్యాన్నదానానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయం నిత్యాన్నదానానికి గుండుబోగుల వెంకటేశ్వరరావు, రామలక్ష్మి దంపతులు శనివారం రూ.20 వేలు విరాళం అందజేశారు.



కాలువలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 4900, మధ్య డెల్టాకు 2500, పశ్చిమ డెల్టాకు 7500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

రేపు జిల్లా స్పందన రద్దు

స్పందన

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. మండలం, సచివాలయం స్థాయిలలో యథాతథంగా జరుగుతాయన్నారు.

న్యూస్‌రీల్

7, 8 తేదీల్లో సీఎం జగన్ పర్యటన



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 7, 8 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శనివారం రాత్రి ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆర్అండ్‌బీ గృహంలో చేపట్టాల్సిన పనులు, హెలిప్యాడ్ నిర్మాణం, బ్యారికేటింగ్ పనులను ఆర్అండ్‌బీ అధికారులు చేపట్టాలన్నారు. సీఎం రాత్రి బస నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగకుండా చూడాలన్నారు. అగ్నిమాపక, మెడికల్, రవాణా, సమాచార, రెవెన్యూ, పౌర సరఫరాలు, ఫుడ్ సేఫ్టీ తదితర శాఖలకు చెందిన అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. సోమవారం సాయంత్రం రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడ నుంచి అతిథి గృహానికి చేరుకుంటారన్నారు. తదుపరి సమీక్ష సమావేశంలో పాల్గొంటారన్నారు. రాత్రి బస నేపథ్యంలో పకడ్బందీగా సన్నాహాలు చేస్తున్నామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, మునిసిపల్ కమిషనర్ కె.. దినేష్ కుమార్, సహాయ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, ఆర్డీవోలు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో జిల్లా ఫస్ట్

కలెక్టర్ మాధవీలత

ప్రకాశంనగర్(రాజమహేంద్రవరం: జిల్లాలోని 20,137 ఇళ్ల నిర్మాణ లక్ష్యానికి గాను 20,066 ఇళ్లను (99.65 శాతం) పూర్తి చేసి రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచినట్టు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. మిగిలిన ఇళ్లు కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. హౌసింగ్, రెవెన్యూ, పంచాయతీరాజ్, హ్యాండ్లూమ్ డే, స్వమిత్వ, వ్యవసాయ అనుబంధ, జగనన్న సురక్ష, జేకేసీ, ఆడుదాం ఆంధ్రాపై శనివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయవాడ నుంచి కలెక్టర్లతో సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, జేసీ ఎన్.తేజ్ భరత్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాధాన్యత భవనాల పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ కార్యక్రమం స్టేజ్ కన్వర్షన్‌పై ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. నా నేల – నా దేశం (మేరీ మిట్టి, మేరా దేశ్)పై ప్రచారం చేయాలన్నారు.

నేడు మంత్రులు అంబటి, కొట్టు రాక

రాజానగరం: నియోజకవర్గంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో ఆదివారం జరిగే వివిధ కార్యక్రమాలలో రాష్ట్ర మంత్రులు అంబటి రాంబాబు, కొట్టు సత్యనారాయణ పాల్గొంటారు. రాజానగరం మండలం దివాన్‌చెరువు జంక్షన్‌లో ఉదయం 11 గంటలకు జరిగే దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు జయంతికి మంత్రి రాంబాబు హాజరవుతారు. అనంతరం దివాన్‌చెరువు నుంచి శ్రీకృష్ణపట్నం మీదుగా పుణ్యక్షేత్రం వరకు జరిగే మోటారుసైకిల్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పుణ్యక్షేత్రంలో జక్కంపూడి రామ్మోహనరావు, వంగవీటి మోహనరంగా విగ్రహాలను ఆవిష్కరిస్తారు. జక్కంపూడి రామ్మోహనరావు జయంతిని పురస్కరించుకుని సీతానగరం మండలం ఇనుగంటివారిపేట పంచాయతీ వద్ద ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా సుమారు వెయ్యి మంది మహిళలకు చీరలను పంపిణీ చేస్తారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు సీతానగరం జీవీకే కన్వెన్షన్ హాలులో నిర్వహించే మెగా జాబ్‌మేళాను మంత్రి సందర్శిస్తారు. తదుపరి రాపాకలో జక్కంపూడి రామ్మోహనరావు జయంతిలో మంత్రి పాల్గొంటారు.

● అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం



నేస్తమా.. సేవా హస్తమా..

● సేవా దృక్పథాన్ని చాటుకుంటున్న మిత్ర సమూహాలు ● సోషల్ మీడియా వేదికగా ఒక్కటవుతున్న స్నేహితులు

శత్రువు ఒక్కడైనా ఎక్కువే.. స్నేహితులు వందమంది అయినా తక్కువే అంటారు వివేకానందుడు. మనిషిని అవసరంలో ఆదుకునే స్నేహ హస్తం కన్నా ప్రియమైనదేదీ లేదంటారు గురునానక్. నిజమైన మిత్రుడెవరో తెలిసేది కష్టకాలంలోనే అంటారు గాంధీజీ.. ఎవరేమన్నప్పటికీ స్నేహాన్ని మించింది ఈ లోకాన లేదంటారు సినీ కవులు.. **ఇంతటి విశిష్ట బంధాన్ని పటిష్టం చేయడానికి ఇప్పటి ఆధునిక కమ్యూనికేషన్ తోడ్పాటునందిస్తోంది.** చిన్నప్పుడెప్పుడో మరిచిపోయిన మిత్రుడ్ని గుర్తు చేస్తోంది. తనతో చదువుకున్న వారందరినీ ఏకం చేస్తోంది.. సోషల్ మీడియా వేదికగా చాలామంది స్నేహితులవుతున్నారు. పుట్టిన రోజు వస్తే ఒకప్పుడు ఇంట్లోవారికి తప్ప మరెవరికీ తెలిసేది కాదు. అలాంటిది ఇప్పుడు ఫేస్‌బుక్.. వాట్సప్‌లు వచ్చాక ఇలాంటి సందర్భాల్లో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరికైనా సహాయం అందించడంలోనూ ఈ మిత్ర సమూహాలు ముందుంటున్నాయి. కొన్నాళ్లుగా టెన్తులోనో.. లేదా మరే సందర్భంలోనో కలిసి చదువుకున్న వారంతా ఏటా ఒకసారైనా కలిసి ఆనందం కలబోసుకుంటున్నారు. వీరి స్నేహ కలయికకు ఆధునిక సమాచారమే వారధిగా నిలుస్తోంది.

ఆపదలో అండగా నిలిచి..

గోపాలపురం: ఇబ్బందుల్లో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981–82లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు. వీరంతా పెద్ద మనసుతో ఒక ట్రస్ట్ ఏర్పాటు చేశారు. అప్పట్లో వీరితో చదువుకున్న సుమారు వంద మంది పూర్వ విద్యార్థుల ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్నారు. తోటి మిత్రులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారు. సుమారు రూ.2 లక్షల ఆర్థిక నిధి ద్వారా పేద విద్యార్థులకు జీవనోపాధిని కల్పిస్తున్నారు. విద్యార్థులకు సంబంధించి ఎవరైనా చనిపోతే బాధిత కుటుంబానికి రూ. 25 వేల తక్షణ ఆర్థిక సహాయం అందిస్తున్నారు. అట్టడుగు వర్గాల స్నేహితులకు వివిధ రంగాల్లో ఉపాధి కల్పిస్తున్నారు. ఇందుకు అవసరాన్ని బట్టీ సాయం చేస్తున్నారు. తనతో పాటు చదువుకున్న పూర్వ విద్యార్థులంతా స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించడం వల్ల సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని వైష్ణవు శ్రీనివాసరావు చెప్పారు.



మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

స్నేహానికి సై

ప్రత్తిపాడు: వారు చిన్ననాటి స్నేహితులు. వారు వృత్తిరీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. 35 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. వారిలో ఒకరు తెలంగాణ గవర్నర్ తమిళిసై కాగా మరొకరు ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని దేవస్ రేమల. వారిద్దరూ తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ఒకే ప్రాంతంలో ఉండేవారు. తమ స్నేహం గురించి రేమల ఏమంటారంటే... ప్రస్తుతం గవర్నర్ తమిళిసై తండ్రి కుమారి అనంతన్, మా నాన్న దేవరాజ్ రాజకీయంగా సన్నిహితులు. **తమిళిసైతో కలిసి రాయపురంలో ఒకటో తరగతి నుంచి ఎస్ఎస్ఎల్‌సీ వరకూ** చదువుకున్నాను. తమిళిసై మెడిసిన్ చదివారు. నేను ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డాను. ఆమె గవర్నరుగా బాధ్యతలు చేపట్టారని తెలిసి చాలా సంతోషించాను. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తూ గవర్నర్‌కు మెయిల్ పంపాను. దీంతో ఆమె స్పందించారు. ఫలితంగా తమిళ సైను కలిసే అవకాశం ఇటీవల వచ్చింది. చూడగానే గవర్నర్ ఆప్యాయంగా పలకరించారు. ఆనాటి ముచ్చట్లను జ్ఞప్తికి తెచ్చుకున్నామని రేమల అన్నారు. అంతస్తులు, హోదాలు తమ స్నేహానికి అడ్డు కాలేదన్నారు.



చిన్ననాటి మిత్రురాలైన తెలంగాణ గవర్నర్ తమిళసైని శాలువాతో సత్కరిస్తున్న ఉపాధ్యాయిని దేవస్ రేమల

ఔదార్యం... అ'పూర్వ'ం

మండపేట: ఆపన్నులకు ఆసరాగా నిలుస్తున్నారు మండపేట ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ సేవా సంస్థ సభ్యులు. ఏటా రూ. 7.5 లక్షల నుంచి రూ. 8 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983–84 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 75 మంది 2008లో ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ పేరిట సంస్థగా ఏర్పడ్డారు. కొంత స్థిర నిధిని ఏర్పాటు చేసుకున్నారు. కోవిడ్ ముందు వరకు 13 ఏళ్ల పాటు ఏటా ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు రూ. 2.5 లక్షల విలువైన పుస్తకాలు, స్టేషనరీని అందించేవారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ప్రభుత్వమే విద్యార్థులకు పుస్తకాలను అందిస్తుండటంతో మూడేళ్లుగా ప్రభుత్వ, మున్సిపల్ హైస్కూళ్లలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు.



సైకియాట్రిస్ట్ డాక్టర్ రామారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్న సభ్యులు (ఫైల్)

కలువపువ్వు సెంటర్‌లో ఏటా శ్రీరామ నవమి నుంచి జూన్ మొదటి వారం వరకు చల్లటి మజ్జిగను సరఫరా చేస్తున్నారు. ఇందుకు ఏటా రూ.4 లక్షలు వెచ్చిస్తున్నారు. సంస్థ కార్యదర్శి సంకా శ్రీనివాసరంగా ఏటా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి రూ. 1.5 లక్షల విలువైన బహుమతులు అందజేస్తున్నారు. ప్రస్తుతం బిక్కిన చక్రవర్తి అధ్యక్షునిగా ఉండగా కోశాధికారిగా పోతంశెట్టి సత్తిబాబు సేవలు అందిస్తున్నారు.

'మొక్క'వోని లక్ష్యం



మొక్కలు నాటుతున్న ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ కర్రి రామారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: వివిధ రంగాల్లో బిజీగా ఉండే కొందరు మిత్రులు పదేళ్ల క్రితం ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీని ప్రారంభించి విశేష సేవలు అందిస్తున్నారు. విద్య, వైద్యం, పర్యావరణంపై వీరెక్కువగా ఫోకస్ పెట్టారు. రాజమహేంద్రవరం..అమలాపురంలలో మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ఈసొసైటీకి అధ్యక్ష,కార్యదర్శులుగా డాక్టర్ కర్రి రామారెడ్డి,డాక్టర్ గోలి వెంకట రామారావు వ్యవహరిస్తున్నారు. ఒకే తరహా భావజాలం గల డాక్టర్లు,ఉపాధ్యాయులు,అడ్వకేట్లు మరికొందరు స్నేహితుల సమూహమే ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ. ఇప్పటి వరకూ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో 5వేల పైబడి మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. రాజమహేంద్రవరంలో కొన్ని పాఠశాలల ఆవరణలో కూడా మొక్కలు నాటుతున్నారు. విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు.

అమ్మఒడి అందుతోంది సార్

- చేతులు పైకెత్తి తెలియజేసిన విద్యార్థులు
- పాఠశాలలను సందర్శించిన ప్రవీణ్ ప్రకాష్



అమ్మ ఒడి అందిరికీ అందుతోందంటూ చేతులు పైకెత్తి తెలుపుతున్న విద్యార్థులు

రంగంపేట: రంగంపేట మండలంలోని పాఠశాలలను రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం సందర్శించారు. తొలుత కొత్త వీరంపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, సాధన పుస్తకాలను పరిశీలించారు. సిలబస్ ప్రకారం పాఠ్యాంశాలు పూర్తి చేయకపోవడం, వాటిని దిద్దకపోవడంతో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత పాత వీరంపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఏడవ తరగతి విద్యార్థులను ఇంగ్లీషు పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేశారు. విద్యార్థుల సమాధానంతో ఆయన సంతృప్తి చెందారు. హెచ్ఎం ప్రసాదరావు, ఆంగ్ల ఉపాధ్యాయుడు పీటర్‌పాల్, విద్యార్థులను అభినందించారు. రంగంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను కూడా సందర్శించారు. మనబడి నాడు–నేడు కింద నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల విద్యార్థులతో మాట్లాడుతూ అందరికీ అమ్మ ఒడి వస్తుందా అని ప్రశ్నించారు. విద్యార్థులందరూ వస్తుందనడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాడు–నేడు పనులు బాగున్నాయంటూ కళాశాల ప్రిన్సిపాల్ వి. శ్రీనివాసరావును అభినందించారు. ఆయన వెంట ఆర్‌జేడీలు శారద, నాగమణి, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం, డీవీఈఓ సుబ్రహ్మణ్యం, ఆర్ఐఓఎం ఎస్‌వీఎల్ నరసింహం, డీవైఈఓ తిరుమలదాసు, మండల విద్యాశాఖాధికారులు కె. శ్రీనివాసరావు, పి. మధుసూదనరావు, జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సమీక్ష

- ప్రాధాన్యతా భవనాల నిర్మాణం వేగవంతం
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- సమీక్షలో ఇన్‌చార్జి మంత్రి వేణు
- పాల్గొన్న హోంమంత్రి వనిత, ఎంపీ భరత్ రామ్, కలెక్టర్ తదితరులు



మాట్లాడుతున్న మంత్రి వేణు, చిత్రంలో మంత్రి వనిత, కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్‌రామ్, చందన నాగేశ్వర్, బుచ్చయ్య చౌదరి, ఆకుల వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: సమస్యల పరిష్కారానికి, సమగ్ర కార్యాచరణకు సమీక్ష సమావేశం ఒక వేదిక కావాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వెనుకబడిన సంక్షేమం, సమాచార పౌరసంబంధాల – సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో శనివారం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 11 అంశాల అజెండా వారీగా ఉపాధి హామీ, ప్రాధాన్యత భవనాలు, విద్య, హౌసింగ్, ఇళ్ల స్థలాలు, ఏపీ టిడ్కో, వ్యవసాయ అనుబంధ రంగాలు, జలవనరులు, వైద్యం, ఆరోగ్యం, ఆర్‌డబ్ల్యూఎస్, పౌర సరఫరాలపై సమీక్షించారు.

భవన నిర్మాణాలు వేగవంతం : మంత్రి వేణు

ఇన్‌చార్జి మంత్రి వేణు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఆర్‌బీకేలు, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. సీఎం జగన్ ఒక మంచి ఆలోచనతో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. తమ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాలు, స్కూళ్లలో జరుగుతున్న నాడు–నేడు పనులు, జగనన్న గోరుముద్దను పర్యవేక్షించాలని సూచించారు. ఈ ఏడాది నియోజకవర్గ పరిధిలో 2 వేల మంది విద్యార్థులు కొత్తగా ప్రభుత్వ స్కూళ్లలో చేరారన్నారు.

ఒక మంచి వేదిక : మంత్రి వనిత

హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో ఇటువంటి సమీక్షలు చేసి, విశ్లేషణల ద్వారా వచ్చిన సూచనల అమలుకు ఒక మంచి వేదిక అన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ఇవి తోడ్పతాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

పనుల పురోగతి : ఎంపీ భరత్ రామ్

ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు జరుగుతున్న తీరు, వాటి పురోగతిపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రభుత్వ ప్రాధాన్యత పనులను వేగవంతం చేయాలన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో ఎన్ఆర్ఈజీఎస్, ఆర్అండ్‌బీ పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మోరంపూడి, బొమ్మూరు, వేమగిరి వద్ద ఫ్లైఓవర్లు మంజూరయ్యాయన్నారు. వాటిలో ఇప్పటికే మోరంపూడి పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. పిడింగొయ్యి ఫ్లైఓవర్‌కు సంబంధించి పరిపాలన ఆమోదం పొందినట్లు ప్రకటించారు.

సమస్యల పరిష్కారం : కలెక్టర్ మాధవీలత

కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో నియోజకవర్గాల వారీగా సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం అధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. కొన్ని సమస్యలు అక్కడికక్కడే, మరికొన్ని మండల, జిల్లాస్థాయిలో పరిష్కరిస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో ఉన్నవాటిపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి ద్వారా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు.

గోదావరి వరదతో ముంపు: ఎమ్మెల్యే గోరంట్ల

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ రూరల్ మండలంలో జల్ల కాలువ షట్టర్లు తెరచుకోకపోవడంతో గోదావరి వరద సమయంలో 2,050 ఎకరాలు నీటమునిగాయన్నారు. రాజమహేంద్రవరం అర్బన్ డ్రైనేజీ నీరు సజావుగా పోయేందుకు ధవళేశ్వరంలో పూర్తిస్థాయిలో పంపుసెట్ ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆవ డ్రైన్ పూర్తి స్థాయి నిర్మాణం కోసం రూ.270 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రస్తుతం రూ.5 కోట్ల మేరకు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

నిధులపై చర్యలు తీసుకోవాలి: కో ఆర్డినేటర్ నాగేశ్వర్

వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రావాల్సిన స్టాంప్ డ్యూటీని త్వరితగతిన చెల్లించాలన్నారు. రూరల్ మండలంలో పంచాయతీలకు ఎన్నికల జరగనందున 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావడం లేదని, దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీలో మార్పులను ఆకళింపు చేసుకోవాలి

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



గోదావరి ఫొటో ట్రేడ్ ఫెయిర్‌లో స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: మారుతున్న కాలానికి అనుగుణంగా ఫొటోగ్రఫీలో వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. దివాన్ చెరువులోని ఎస్‌వీపీసీ కన్వెన్షన్ హాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోదావరి ఫొటో ట్రేడ్ ఫెయిర్ 2023ని శనివారం ఆయన సందర్శించారు. తొలుత కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్రే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను, ఆధునిక కెమెరా, ఇతర పరికరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జ్ఞాపకాలను పదిలంగా భావితరాలకు అందించే గొప్పకళ ఫొటోగ్రఫీ అన్నారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి తమ కుటుంబం ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గోదావరి ఫొటో ట్రేడ్ ఫెయిర్‌కి విచ్చేసిన తెలుగు సినిమా ఫొటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షుడు పీజీ బిందా, ఫొటోగ్రాఫర్ వెంకీని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫొటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షుడు పోసాని వీరేంద్ర, జిల్లా అధ్యక్షుడు కోని శ్రీను, గౌరవాధ్యక్షులు అల్లు బాబి, సలహాదారు కేతా శ్రీను, రావు, ఎస్ఎస్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధర్మ ప్రచార మాసోత్సవాలు

- నెల రోజుల కార్యక్రమాలు
- రత్నగిరిపై ప్రారంభించనున్న దేవదాయశాఖ మంత్రి సత్యనారాయణ

అన్నవరం: హిందూ ధర్మం గొప్పతనాన్ని వివరించేందుకు 'ధర్మ ప్రచార మాసోత్సవాలను' అధిక శ్రావణ శుద్ధ పంచమి, ఆదివారం ఉదయం 9.39 గంటలకు అన్నవరంలోని రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో ప్రారంభిస్తున్నారు. నెల రోజుల పాటు జరుగనున్న ఉత్సవాలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ శ్రీకారం చుడతారు. కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొంటారని అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ శనివారం వివరించారు. రాష్ట్ర ప్రజల సర్వతోముఖాభివృద్ధికి, వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ స్వామివారి దేవస్థానం సహస్ర దీపాలంకార సేవ మందిరంలో ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు సత్యదేవుని వ్రతమాచరిస్తారు. అనంతరం వినాయక అతిథి గృహం నుంచి మంత్రి దంపతులతో పాటు, ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత తదితరులు భారీ ఊరేగింపుగా సత్యదేవుని ఆలయానికి చేరుకుని దేవేరులకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఉదయం 9.30 గంటలకు సత్యదేవుని ప్రచార రథాన్ని జెండా ఊపి ధర్మ ప్రచారం ప్రారంభిస్తారు. తరువాత రామాలయం వద్ద విశ్రాంత మండపంలో జరిగే ధర్మ ప్రచార సభలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే ప్రసంగిస్తారు. అనంతరం దేవస్థానం నిర్మాణాలపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.


సత్యదేవుని ప్రచార రథం

అడ్డతీగలలో సామూహిక వ్రతాలు

ధర్మ ప్రచార మాసోత్సవాలలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం సత్యదేవుని సామూహిక వ్రతాలు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. అనంతరం సత్యదేవుని రథం ద్వారా చుట్టుపక్కల ప్రాంతాల్లో ధర్మప్రచారం నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి విరాళం

రూ.10 లక్షలు అందజేసిన దాత


దాత దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్మిస్తున్న అన్నదాన సత్రానికి రూ.10,10,116 విరాళాన్ని పెనుమంత్ర మండలం ఆలమూరు గ్రామానికి చెందిన ఇందుకూరి బాల బంగార్రాజు, స్వాతి దంపతులు అందజేశారు. శనివారం వాడపల్లి వెంకన్న సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజులకు ఈ విరాళాన్ని సమర్పించారు. ఇటీవల వెంకన్న సన్నిధిలో సుమారు రూ.5.50 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తాము కోరిన కోర్కెలు నెరవేరడంతో ఈ విరాళాన్ని అందించినట్లు ఇందుకూరి బాల బంగార్రాజు, స్వాతి తెలిపారు. పదేళ్ల నుంచి ఆలయానికి వస్తుండడంతో రూ.10 లక్షలు విరాళం అందించామని అన్నారు. దాత దంపతులను ఆలయ కమిటీ సభ్యులు అభినందించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి

- ఐలు రాష్ట్ర నాయకుడు రాజగోపాల్
- ఘనంగా ఆరవ మహాసభ


సమావేశంలో మాట్లాడుతున్న మేడపాటి ధర్మారెడ్డి తదితరులు

కాకినాడ లీగల్: దేశవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలని ఆలిండియా లాయర్ యూనియన్ (ఐలు) రాష్ట్ర నాయకుడు డి.రాజగోపాల్ డిమాండ్ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 'ఐలు' ఆధ్వర్యంలో ఆరో మహాసభ కాకినాడ బార్ అసోసియేషన్ హాల్లో శనివారం నిర్వహించారు. మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేడపాటి ధర్మారెడ్డి అధ్యక్షత వహించగా రాజగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐలు చేసిన కార్యక్రమాల నివేదికను జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరాచార్యులు ప్రవేశపెట్టగా సభ్యులంతా ఆమోదించారు. అనంతరం ఐలు 2023–25 జిల్లా, నగర కమిటీల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ మేడపాటి ధర్మారెడ్డి (కాకినాడ), ప్రధాన కార్యదర్శిగా జి.భాస్కరాచార్యులు (పిఠాపురం), ఉపాధ్యక్షులుగా ఇక్బాల్ (అమలాపురం), ఆర్వీ రమణారావు (పిఠాపురం), కార్యదర్శులుగా కేఆర్‌కే రాజు (ముమ్మిడివరం), టీవీవీ రమణమూర్తి (అనపర్తి), జాయింట్ సెక్రటరీగా సుదిన శ్రీనివాస్ (కాకినాడ), కోశాధికారిగా వెంకటరెడ్డి బహదూర్ షా (కాకినాడ)తో పాటు 26 మంది సభ్యులతో నూతన ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నికైంది. నగర కమిటీ అధ్యక్షుడిగా పి.రామచంద్రరాజు, కార్యదర్శిగా కె.నాగజ్యోతి, వైస్ ప్రెసిడెంట్‌గా ఉమామహేశ్వరావు, ట్రెజరర్‌గా టి.రాధాకృష్ణ, . జాయింట్ సెక్రటరీగా దేశీతో పాటు 12 మంది ఎన్నికయ్యారు.

స్కూటీ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతి చెందిన పెదబాబు

నిడదవోలు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొవ్వూరు మండలం వేములూరు గ్రామానికి చెందిన తిరుమారెడ్డి పెదబాబు (25), తన స్నేహితుడితో కలసి స్కూటీపై దేవరపల్లి మండలం త్యాజంపూడి బంధువులు ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా కాటకోటేశ్వరం వద్ద ఆటోను తప్పించబోయి ప్రమాదవశాత్తూ జారిపడటంతో పెదబాబు తలకు తీవ్రగాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ ఘటనలో మృతుడి స్నేహితుడికి స్వల్ప గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చేపల చెరువులుగా మార్చిన అర్చక సేవా భూములు స్వాధీనం

కోర్టు ఆదేశాలతో ఆలయ ఈఓకు అప్పగింత

కపిలేశ్వరపురం: వల్లూరులో అర్చకుల స్వాధీనంలో ఉన్న దేవదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన 6.44 ఎకరాల సాగు భూములను నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువులుగా తవ్విన విషయంలో సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకున్నారు. కోర్టు, దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అర్చకుల నుంచి భూములను స్వాధీనం చేసుకున్నారు. ఆ భూములను శనివారం జిల్లా దేవదాయ శాఖ అధికారి కేఎస్‌వీడీవీ ప్రసాద్ సమక్షంలో వల్లూరులో ఆలయ ఈఓ పెదపూడి వీరవెంకట సత్యనారాయణమూర్తికి అప్పగించారు. ఆ వివరాల ప్రకారం.. వల్లూరులోని శ్రీఅగస్త్యేశ్వర, శ్రీవేణుగోపాలస్వామి ఆలయాల్లో సేవ చేస్తున్న అర్చకుల స్వాధీనంలో 6.44 ఎకరాల దేవదాయ భూమి ఉంది. ఆ భూములున్న ప్రదేశంలో గ్రామానికి చెందిన, ఓ రాజకీయ నాయకుడి ప్రోద్బలంతో చేపల చెరువులతో ఆక్వా సాగు జరుగుతుంది. అర్చక సేవా సర్వీసు భూములను సైతం లీజుకు తీసుకుని చేపల చెరువులుగా మార్చేశారు. దీనిపై ఆలయ ఈఓ పెదపూడి వీరవెంకట సత్యనారాయణమూర్తి అంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు.


భూముల స్వాధీన పత్రాలను అందుకుంటున్న ఈఓ సత్యనారాయణమూర్తి

2022 జనవరి 21న తొమ్మిది మంది ఆలయ అర్చకులపై అంగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దేవదాయ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా దురుద్దేశంతో అక్రమ లాభం కోసం వాటిని చెరువులుగా తవ్వేశారంటూ ఈఓ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వివాదం కోర్టు వరకూ వెళ్లింది. కోర్టు ఆదేశాలపై దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ సూచనలతో అర్చకుల భూములను స్వాధీనం చేసుకుని ఈఓకు అప్పగించారు. కార్యక్రమంలో రామచంద్రపురం తనిఖీదారు ఆర్.బాలాజీ రామ్‌ప్రసాద్, వీఆర్వో శ్రీనివాస్, దేవదాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రి రాజాకు ప్రముఖుల పరామర్శ


సత్యనారాయణమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ


మంత్రి రాజాను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులు

తుని: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాను పలువురు ప్రముఖులు పరామర్శించారు. శనివారం తుని మండలం ఎస్.అన్నవరం క్యాంప్ కార్యాలయానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు భారీగా తరలివచ్చారు. శుక్రవారం మంత్రి మాతృమూర్తి సత్యనారాయణమ్మ గుండె పోటుతో తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ప్రత్తిపాడు, పాయకరావుపేట ఎమ్మెల్యేలు పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ ఎమ్మెల్యేలు వరుపుల సుబ్బారావు, రాజా అశోక్‌బాబులు మంత్రి రాజాను, సత్యనారాయణమ్మ భర్త శంకర్రావును పరామర్శించారు. సత్యనారాయణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డాక్టర్స్ అసోసియేషన్, బార్ అసోసియేషన్, పాస్టర్స్ ఫెలోషిఫ్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి రాజాకు ధైర్యం చెప్పారు. సత్యనారాయణమ్మ ఆత్మకు శాంతి కలగాలని పాస్టర్స్ ఫెలోషిఫ్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రార్థనలు చేశారు. ఆదివారం తుని నియోజకవర్గ పరిధిలోని అన్ని చర్చిల్లో మంత్రి రాజా కుటుంబానికి స్వస్థత చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు చేయాలని నిర్ణయించారు. తుని చాంబర్ ఆఫ్ కామర్స్ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలో అన్నిరకాల వ్యాపార, ప్రైవేట్ విద్యాసంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, తుని ఎంపీపీ బొప్పన రాము, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్,శ్రీహరి రాజు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్


కాపవరం జంక్షన్ వద్ద కొవ్వూరు రూరల్ పోలీసులు పట్టుకున్న గంజాయి, నిందితులు

కొవ్వూరు: రాజమహేంద్రవరం నుంచి ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్న 204.400 కిలోల గంజాయిని కాపవరం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం పట్టుకున్నామని కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. దీని విలువ రూ.10.20 లక్షలు ఉంటుందన్నారు. ఇందులో బీహార్ రాష్ట్రానికి చెందిన చోటేలాల్ ప్రసాద్‌సింగ్, లక్ష్మణ్ షాహ్, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరానికి చెందిన సంకుడు బుచ్చిరెడ్డిలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. గంజాయి తరలింపునకు వినియోగించిన లారీతో పాటు పది ప్లాస్టింగ్ సంచుల్లో దాచి ఉంచిన 204.400 కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో నలుగురిని అరెస్ట్ చేయాల్సి ఉందని వివరించారు. నిందుతులను కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. గంజాయి కేసు వ్యవహారం మీడియాకు తెలియడంతో పోలీసులు ఆదరాబాదరాగా రాత్రి ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు.

కాలువలో వ్యక్తి గల్లంతు


శ్రీనివాస్ (ఫైల్)

సీతానగరం: బొబ్బిల్లంక - మిర్తిపాడు మధ్యలో తొర్రిగడ్డ కాలువ కల్వర్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. మిర్తిపాడుకు చెందిన పీతల శ్రీనివాస్ (35) శనివారం ఉదయం 11 గంటలకు ఆ కల్వర్టు వద్దకు వచ్చి ఎగురుతున్న చేపలను పట్టుకుని ఇంటికి చేరుకున్నాడు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు కల్వర్టు వద్దకు వచ్చి చేపలను పట్టుకునే క్రమంలో ప్రమాదవశాత్తు కాలువలో పడి కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న ఇద్దరు శ్రీనివాస్‌ను కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. రాజమహేంద్రవరం పేపర్‌మిల్లులో శ్రీనివాస్ కాంట్రాక్ట్ కూలీగా పని చేస్తున్నాడు. ఖాళీ సమయంలో ఇంటి వద్ద మోటారు సైకిల్ మరమ్మతులు చేస్తుంటాడు. ఖాళీగా ఉన్నందున శనివారం చేపలు పట్టుకోవడానికి వెళ్లి మృత్యువాత పడ్డాడు. భార్య నళిని గ్రామ వాలంటీర్‌గా పని చేస్తుండగా, ఎనిమిదేళ్ల కుమారుడు సాత్విక్ రాజు, ఆరేళ్ల కుమార్తె ఆరాధ్యలు, తల్లి బూసమ్మలు ఉన్నారు. అతని గల్లంతుతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. రెవెన్యూ శాఖ సిబ్బంది, స్థానికులు తొర్రిగడ్డ కాలువలో శ్రీనివాస్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

'క్యాపిటల్' నిందితుడి అరెస్టు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): షేర్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేస్తామని చెప్పి ప్రజలనుంచి డబ్బులు వసూలు చేసిన మద్దుకూరి ప్రదీప్‌ను రాజమహేంద్రరంలోని ప్రకాశనగర్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. స్కాటో క్యాపిటల్ కంపెనీ పేరుతో మద్దుకూరి ప్రదీప్ అధిక వడ్డీలు ఇస్తామని నమ్మబలికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రూ.10 కోట్లు వసూలు చేసి పరారైన సంఘటనను 'సాక్షి' ఇటీవల ప్రచురించింది. పోలీసులు కేసు దర్యాప్తు వేగవంతం చేసి మద్దుకూరి ప్రదీప్‌ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు.రిమాండ్ విధించడంతో సెంట్రల్ జైలుకు అతనిని తరలించారు.

జిల్లా ఎస్పీగా సతీష్‌కుమార్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీగా ఎస్.సతీష్‌కుమార్ నియమితులయ్యారు. డిప్యూటేషన్‌పై ఇక్కడ పనిచేసిన సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి కర్ణాటకకు వెళుతున్నారు. సతీష్ కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో సుధీర్‌కుమార్ తాత్కాలికంగా విధులు నిర్వర్తించనున్నారు.